క్లుప్తంగా

భారత రాజ్యాంగంపై అవగాహన ఉండాలి



అచ్చంపేట: భారత రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు క్విజ్ పోటీలు నిర్వహించినట్లు స్థానిక కస్తుర్బాగాంధీ బాలిక కళాశాల ప్రిన్సిపల్ జ్యోత్స్నదీప్తి పేర్కొన్నారు. దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జనవరి 26న భారత రాజ్యాంగంపై నిర్వహించిన క్విజ్ పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు పంపిణీ చేశారు. డీబీఆర్సీ ఉమ్మడి గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, మండల కన్వీనర్ సందెపోగు అశోక్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



నకరికల్లు: విద్యార్థుల మధ్యాహ్నభోజనంలో నాణ్యతలోపిస్తే సహించేదిలేదని డీఆర్‌డీఏ పీడి బి.బాలూనాయక్ హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన పథకాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. వంటశాలను, వంటచేసే పరిసరాలను, కూరగాయల నాణ్యతను తనిఖీచేసి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి కింద కూర్చొని వారితో మాట్లాడారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భోజనం తయారుచేసే పాత్రలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. నాణ్యతలోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రంగాదేవి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ బత్తిన మల్లికార్జునరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో ప్రత్యేకాధికారి తనిఖీ



క్రోసూరు: మండల ప్రత్యేక అధికారి జి.మోహన్‌బాబు అంగన్‌వాడీ కేంద్రాలు, జగనన్న కాలనీలను శుక్రవారం సందర్శించారు. క్రోసూరులోని 3, 8, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి, రేషన్ సక్రమంగా అందుతుందా.. లేదా అని అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే స్టాక్, నాణ్యతను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. బాలింతలకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, మెనూ తదితర వివరాలను తెలుసుకున్నారు. క్రోసూరు, దొడ్లేరు జగనన్న కాలనీలు, ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్లు, దొడ్లేరులో నిర్మిస్తున్న సబ్ సెంటర్ ను పరిశీలించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ పి.శివరామయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ బి.శీతారామయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ పి.స్వర్ణకుమారి, సెక్టార్ సూపర్ వైజర్ మాధవి పాల్గొన్నారు.

వేడుకగా పునఃప్రతిష్ఠా మహోత్సవం



పెదకూరపాడు: మండల పరిధిలోని 75త్యాళ్లూరు గ్రామంలో సీతారామచంద్రస్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా మూడో రోజు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా నిత్యార్చన, పుణ్యాహ వచన, అగ్ని ఆరాధన, హోమాలు నిర్వహించారు. 108 మంది మహిళా భక్తులు కుంకుమార్చన పూజలు చేశారు. పునఃప్రతిష్ఠ చేయనున్న సీతారామ లక్ష్మణహనుమత్ గరుడ శిలా మూర్తులకు పరుచూరి శ్రీనివాసాచార్యులు, బాలకృష్ణామాచార్యుల పర్యవేక్షణలో అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అనువంశ ధర్మకర్తలు చిర్రా రాజశేఖరరెడ్డి, సురేంద్రరెడ్డికి రుత్విక బృందాలు దీక్షా వస్త్రాలు అందజేశారు.

మాదలలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు జయకృష్ణ, ఎస్.సూర్యప్రకాశరావులు పాల్గొని 113 మందికి వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంతకుమారి, సూపర్‌వైజర్లు పీటర్‌డానియేన్, జోస్పిన్‌రాణి, రవితేజ, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చాం.. మళ్లీ ఆశీర్వదించండి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కొండూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ఎన్నికల హామీలనే కాకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని కొండూరులో శుక్రవారం రాత్రి ఆయన మూడవ రోజు ఆయన నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. గత మూడున్నరేళ్లలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారంపై అధికారులకు సూచనలిచ్చారు. మాయ మాటలు చెప్పడం.. ప్రజలను మోసం చేయడం తమకు చేతకాదని, చెప్పింది చెప్పినట్లు చేయడమే తెలుసునని ఎమ్మెల్యే ఈ సందర్భంగా స్పష్టం చేశారు. తాము సాగు చేసుకుంటున్న అటవీ భూములపై హక్కు కోసం గిరిపుత్రులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా.. గత పాలకులు పట్టించుకోలేదన్నారు. అటవీశాఖాధికారులతో సంప్రదించి తాను హక్కు పత్రాలను, పాసు పుస్తకాలను ఇప్పించానని చెప్పారు. గ్రామంలో అన్ని వీధులకు సిమెంటు రోడ్లు, సైడు కాలువలు నిర్మించినట్లు వెల్లడించారు. ప్రతి ఇంటికి మంచి నీటి కుళాయి ఏర్పాటు చేసి కృష్ణానది నీటిని ఇవ్వనున్నట్లు తెలిపారు. గ్రామంలో రూ.16కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగినట్లు చెప్పారు. ఇందులో 10 శాతమైనా.. గత ప్రభుత్వంలో జరిగిందా అని ప్రశ్నించారు. ప్రజలు మంచిని గుర్తించాలని, సంక్షేమ పథకాలు అమలు తీరులో గత ప్రభుత్వానికి, మనందరి ప్రభుత్వానికి బేరీజు వేసుకోవాలన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉందని, అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే నంబూరు తెలిపారు. నారా లోకేష్ చేపట్టిన పాద యాత్ర ఎందుకో, ఎవరికోసమో అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఉప ఎంపీపీ గంగసాని బాబు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సచివాలయాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఎస్టీ నాయకులు బాణావతు శ్రీరాములు నాయక్, బీసీ నాయకులు చొప్పరపు రామయ్య, రంగా, సాగనబోయిన వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విదేశీ విద్యాదీవెన నిరుపేద విద్యార్థులకు వరం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



విద్యార్థుల తల్లిదండ్రులకు నగదు మంజూరు ఉత్తర్వులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: ప్రతిభ ఉండి ఆర్థిక స్తోమత లేక విదేశీ విద్యా అవకాశాలను కోల్పోయే నిరుపేద విద్యార్థులకు జగనన్న విదేశి విద్యా దీవెన పథకం గొప్ప వరమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో విదేశాలలో ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు శుక్రవారం జగనన్న విదేశీ విద్యాదీవన పథకం ద్వారా నగదు మంజూరు ఉత్తర్వుల కాపీలను ఆయన అందజేశారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఐదుగురు విద్యార్థుల బ్యాంకు ఖాతాలకు ఈ పథకం కింద రూ.16.91లక్షలు జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. వీరిలో అచ్చంపేట మండలం తాళ్ల చెరువుకు చెందిన దారా అఖిల్, బెల్లంకొండ మండలం, మాచాయపాలేనికి చెందిన సోమా బత్తిన ప్రవంతి, అమరావతి మండలం అమరావతికి చెందిన పెరికల భాగ్యశ్రీ , పెదకూరపాడు మండలం, 75త్యాళ్లూరికి చెందిన వజ్రాల మల్లికార్జునరెడ్డి, పెదకూరపాడుకు చెందిన చింతాబత్తిన సూర్యకిరణ్ ఉన్నట్లు వెల్లడించారు. విద్యార్థుల మేనమామగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి విద్యాభివృద్ధికి అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి అనేక గొప్ప పథకాలను తీసుకొచ్చారని తెలిపారు. రాష్ట్రంలో రూ.8లక్షల లోపు ఆదాయం ఉన్న 213 మంది విద్యార్థులకు రూ.19.95కోట్లు ఇవ్వగా పల్నాడు జిల్లాలో 17 మందికి రూ.1.01 కోట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు లోతేటి శివశంకర్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

సత్తెనపల్లి: సచివాలయాల ద్వారా పుర ప్రజలకు మెరుగైన సేవలను సులువుగా అందించాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. పట్టణంలోని 9,10 వార్డులకు సంబంధించిన 6వ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టిందని, ప్రజాసేవలో తరించే అవకాశం కల్పించిందన్నారు. 540 రకాల పౌర సేవలను అందుబాటులోకి తీసుకొచ్చిందని, ఏ ఒక్కరిని వెనక్కు పంపకుండా సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా రివ్యూ చేశారు. స్పందన రికార్డుల నిర్వహణను పరిశీలించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ తదితర వాటిపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.నగేష్, మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, సచివాలయ ఉద్యోగులు, తదితరులు ఉన్నారు.

నేడు గృహ సారథులకు శిక్షణ

అమరావతి: ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు ఏర్పాటు చేసిన మండలంలోని గృహ సారథులకు శనివారం ధరణికోట జేబీ గార్డెన్స్‌లో రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సచివాలయాల మండల కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు జరిగే మొదటి విడత శిక్షణలో ధరణికోట–1, 2, ముత్తాయపాలెం, దిడుగు, మల్లాది, జూపూడి అత్తలూరు, మునగోడు, తురగావానిపాలెం, లింగాపురం సచివాలయాల పరిధిలోని గృహ సారథులకు, అలాగే మధ్యాహ్నం 1.30 నుంచి 4గంటల వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో అమరావతి–1, 2, వైకుంఠపురం, పెద మద్దూరు, ఎండ్రాయి, చావపాడు, నరుకుళ్ళపాడు, ఎనికపాడు, కర్లపూడి, లేమల్లె, ఉంగుటూరు, నెమలికల్లు, మండెపూడి గ్రామాల గృహ సారథులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు శిక్షణలో పాల్గొని, దిశానిర్దేశం చేస్తారని తెలిపారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

అచ్చంపేట: ఉపాధి హామీ పథకం కింద 2021–22 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ ప్రజా వేదిక జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు, ఉపాధి సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

ముప్పాళ్ళ గ్రామ సచివాలయం తనిఖీ

మాదల(ముప్పాళ్ళ): ముప్పాళ్ళ గ్రామ సచివాలయాన్ని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాదు శుక్రవారం తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా సచివాలయ సిబ్బంది విధులు, అందిస్తున్న సేవలపైన ఆరా తీశారు. రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ అర్జీలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డు రూమ్‌ను పరిశీలించారు. సర్వే అండ్ ల్యాండ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వై.నాగేశ్వర్, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఎంపీడీఓ పీ.పుట్టారెడ్డి, ల్యాండ్స్ అండ్ సర్వే డీ.ఐ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ ఏడుకొండలు, సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పెదకూరపాడు వైస్ ఎంపీపీ ఏకగ్రీవ ఎన్నిక



ఉపాధ్యక్షురాలిగా నియామక పత్రం అందుకుంటున్న బాలమేరి

పెదకూరపాడు: పెదకూరపాడు మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగింది. మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ సెగ్మెంట్‌లకు గాను, ఎంపీపీ ఒప్పందంలో భాగంగా 75త్యాళ్లూరు ఎంపీపీ ఈదా సాంబిరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. దీంతో వైఎస్ ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లింగంగుట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు కుక్కమల్ల బాలమేరి వైఎస్ ఎంపీపీ పదవికి నామినేషన్ దాఖలు చేశారు. మరెవరూ నామినేషన్ దాఖలు చేయలేదు. పాటిబండ్ల –2 ఎంపీటీసీ పాటిబండ్ల మేరి రాణి బలపర్చగా పెదకూరపాడు –3 ఎంపీటీసీ కంచర్ల నిర్మల ప్రతిపాదించడంతో బాలమేరి ఏకగ్రీవంగా మండల ఉపాధ్యక్ష పదవికి ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి వరప్రసాద్ ప్రకటించారు. అనంతరం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. నియామక పత్రం అందజేశారు. బాలమేరికి ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, మరో వైస్ ఎంపీపీ షేక్ చాందబాషా, జిల్లా వైఎస్సార్ సీపీ కార్యదర్శి కంకణాల శివాజీ, మండల కన్వీనర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎంపీడీఓ నరసింహారావు అభినందనలు తెలిపారు.

గృహనిర్మాణ లబ్ధిదారులకు నగదు పంపిణీ



లబ్ధిదారులకు బాంకులింకేజీ రుణాలను పంపిణీ చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఎంపీడీఓ, వైస్ ఎంపీపీ, హౌసింగ్ ఏఈ

నకరికల్లు : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు జగనన్నకాలనీలు సిద్ధమవుతున్నాయని డీఆర్‌డీఏ పీడి బి.బాలూనాయక్ తెలిపారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళల్లో గృహాలు మంజూరైన లబ్ధిదారులకు బ్యాంకులింకేజీ రుణాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు మరింత సాయం అందించేందుకు ఒక్కొక్కరికీ రూ. 35 వేల చొప్పున రుణాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ రసూల్, ఏపీఎం సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి నెలాఖరుకు సర్వే పూర్తి చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్



అనుపాలెం, రెడ్డిగూడెంలలో ఇళ్లను పరిశీలిస్తున్న జేసీ

రాజుపాలెం : మార్చి నెలాఖరు కల్లా పూర్తిగా సర్వే జరపాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొండమోడు నుంచి పేరేచర్ల వరకు 167 ఏజీ జాతీయ రహదారి మంజూరైనందున పలు గ్రామాల్లో ఇళ్లు కోల్పోయే గ్రామాలను జేసీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కోటనెమలిపురి, అనుపాలెం, రాజుపాలెం, రెడ్డిగూడెం గ్రామాలను పరిశీలించారు. రాజుపాలెం, అనుపాలెంలలో సుమారు రెండు ఇళ్ల చొప్పున రెడ్డిగూడెం గ్రామంలో సుమారుగా 63 ఇళ్లు రహదారి కింద పోతున్నట్లు అంచనాలు తయారు చేసినట్లు తెలిపారు. మార్చి నెలాఖరుకల్లా ఇళ్లు, స్థలాలు కోల్పోయే బాధితులకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట పల్నాడు జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్(సర్వేయర్) నాగేశ్వర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్(సర్వేయర్) విజయకుమార్, తహసీల్దారు నళిని, మండల సర్వేయర్ శ్రీనివాసరాజు, వీఆర్వోలు, గ్రామ సర్వేలు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ముచికుంద మహర్షి ఆశ్రమ ఆరాధన

రాజుపాలెం: మండలంలోని కొండమోడు సమీపంలో గల శ్రీముచికుంద మహర్షి ఆశ్రమం 43వ వార్షిక భగవదారాధన ఈనెల 5వ తేదీనా నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ ట్రస్టు చైర్మన్ తోట మోహన్‌రావు శుక్రవారం తెలిపారు. ఆశ్రమ ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ చల్లా శ్రీనివాసశర్మ ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహిస్తారు. ఆరాధనకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, శాసన సభ్యులు కాసు మహేశ్వరరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరి శంకరరావు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, అభిమానులు ,నాయకులు హాజరు కావాలని తెలిపారు.

కేజీబీవీలో విద్యార్థినులకు వైద్య పరీక్షలు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాలలో స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి పాల్గొని అనారోగ్యంతో ఉన్న వారిని గుర్తించి వారికి మందులను అందించారు. ప్రతి విద్యార్థిని వైద్యపరీక్షలు నిర్వహించి, వారి సమస్యలను బట్టి వైద్య సేవలందించారు. వారి హెల్త్ కార్డుల్లో నమోదు చేశారు.

రుచికరంగా ఆహారాన్ని అందించాలి

మండల ప్రత్యేకాధికారి కాంతారావు



పాఠశాలలో మధ్యాహ్నభోజనం చేస్తున్న ప్రత్యేకాధికారి కాంతారావు, ఎంపీడీఓ పుట్టారెడ్డి


ముప్పాళ్ళ: పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్నభోజనాన్ని రుచికరంగా అందించాలని మండల ప్రత్యేకాధికారి, నరసరావుపేట డివిజన్ పశుసంవర్ధకశాఖ ఏడీఏ కె.కాంతారావు చెప్పారు. ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్నభోజనాన్ని శుక్రవారం తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి తిన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, నాడు–నేడు ద్వారా నాణ్యమైన విద్యతో పాటుగా పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. విద్యార్థులకు కోడిగుడ్లు, వచ్చే వారం నుంచి రాగిజావ అందిస్తోందన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులుపై సమీక్ష నిర్వహించారు. ముప్పాళ్ళ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ముప్పాళ్ళ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. కొంకావారిపాలెంలోని జగనన్న గృహ నిర్మాణాలను పరిశీలించారు.

జాతీయస్థాయిలో విద్యార్థి ప్రతిభ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువు తున్నటువంటి బత్తుల భరత్ గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు చిత్తూరు జిల్లా తిరుపతిలో జరిగినటువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అండర్ –19 స్కూల్ గేమ్స్ ఫుట్‌బాల్ పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు సెమీ ఫైనల్‌కు వెళ్లి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. గుంటూరు జిల్లా టీం కెప్టెన్ బత్తుల భరత్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో చోటు సంపాదించుకున్నాడు.

ప్రభుత్వ ప్రాధాన్యత లక్ష్యాలను చేరుకోవాలి

మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ సుధాకర్



సత్తెనపల్లి: ప్రభుత్వ ప్రాధాన్యత లక్ష్యాలను ప్రతి ఒక్కరూ చేరుకోవాలని సత్తెనపల్లి మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ ఏ.సుధాకర్ అన్నారు. ప్రత్యేక అధికారుల దినోత్సవంలో భాగంగా సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ చేరుకోవాలన్నారు. 19 ఏళ్ల లోపు ఎనీమీయాకు సంబంధించిన సర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లులో భాగంగా జగనన్న లేఔట్‌లో నిర్మిస్తున్న పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా శాఖల వారీగా సమీక్ష చేసి లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో ఎంపీడీఓ జీవి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, మండల స్థాయి అధికారులు, తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో చేనేత కార్మికులకు తీవ్ర అన్యాయం

ఏపీ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు శివదుర్గారావు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం 2023–24 బడ్జెట్లో చేనేత రంగానికి కేవలం రూ.200 కోట్లు కేటాయించి చేనేత కార్మికులకు తీరని అన్యాయం చేసిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ అధ్యక్షుడు కట్ట శివ దుర్గారావు శుక్రవారం అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల బ్రతుకుల్లో దుమ్ము కొట్టిందని ఇది చేనేత కార్మికులకు కేంద్ర ప్రభుత్వ మరణ శాసనం అని విమర్శించారు. వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది ఒకే వృత్తిని ఆధారం చేసుకుని జీవనోపాధిని కల్పిస్తున్న వృత్తి చేనేత రంగం అన్నారు. రూ.లక్షల కోట్ల బడ్జెట్‌లో చేనేత రంగానికి కేవలం రూ.200 కోట్లు కేటాయించి టెక్స్‌టైల్ రంగానికి రూ. 53 వేల కోట్లు కేటాయించడం చూస్తే చేనేత పై కేంద్ర ప్రభుత్వం చవితి తల్లి ప్రేమ చూపిస్తోందని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా చేనేత రంగానికి రూ.3,600 కోట్లు కేటాయిస్తే బీజేపీ అధికారంలోకి వస్తే రూ. 5 వేల కోట్లు కేటాయిస్తామని మేనిఫెస్టోలో పెట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ చేనేత రక్షణకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని చెన్నైలో ప్రకటించి మొత్తం 8 సంవత్సరాల కాలంలో రూ. 5 వేల కోట్లు కూడా కేటాయించలేదని విమర్శించారు. భారతదేశంలోనే చేనేత లేకుండా చేయాలని, ఆకలి చావులకులోన్ అవుతూనే కార్మికులకు జాతీయ ఉత్పత్తి పేరుతో ప్రగల్భాలు పలికి జీఎస్టీలో చేర్చి చేనేత పరిశ్రమను దుంప నాశనం చేయాలని మోడీ ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తోందన్నారు. ఈ విధమైన మోడీ విధానాలను దేశవ్యాప్తంగా తిప్పికొట్టాలన్నారు. ఆయనతో పాటు పల్నాడు జిల్లా కార్యదర్శి అనుముల వీరబ్రహ్మం ఉన్నారు.

పథకాల అమలుపై అధికారులతో సమీక్ష



ప్రభుత్వశాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడి బాలూనాయక్, ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి

నకరికల్లు: ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు అందజేయడంలో సమర్థవంతంగా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడి, ప్రత్యేక అధికారి బి.బాలూనాయక్ సూచించారు. ప్రభుత్వశాఖల పనితీరుపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 లేఅవుట్లల్లో 1360 మందికి పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీ ఫేజ్–1, ఫేజ్–2లలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని అన్నారు. జాబ్‌కార్డులకు ఆధార్‌సీడింగ్ చేయాలన్నారు. కొత్తగా మంజూరైన నాలుగు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల పనులు వేగవంతం చేయాలన్నారు. గర్భిణి, బాలింతలు రక్తహీనతతో బాధపడకుండా ప్రభుత్వం అందజేస్తున్న మందులు, పౌష్టికాహారం అందజేయాలన్నారు. జగనన్న పాలవెల్లువ పథకం ప్రయోజనాలను గ్రామీణప్రాంతాల్లోని పాడిరైతులకు తెలియజేయాలన్నారు. స్పందన దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ చేసే క్రమంలో సర్వర్ బిజీగా ఉంటుందన్న సమస్యను పరిష్కరించుకునేందుకు ఉదయం 6–9, సాయంత్రం 5–8 గంటల సమయంలో ఆన్‌లైన్ చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఫిషరీస్ శాఖ ద్వారా మత్స్యకారులకు అందజేస్తున్న రాయితీలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఏఓ కె.దేవదాసు, ఏఈలు రూఫస్‌డానియేల్, షేక్.రసూల్, డాక్టర్ శ్రీనునాయక్, డాక్టర్ నాగమణి, ఈఓపీఆర్డీ గిరిధర్, ఏపీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు ధృవీకరణ పత్రాల ప్రదానం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాస రావు, హెచ్‌ఎమ్ నాగరాజు, మేడే వెంకటరమణ

సత్తెనపల్లి: మహిళలకు, విద్యార్థులకు, రైతులకు, పేదవారికి ఎన్నో ఉపయోగపడే కార్యక్రమాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి చైతన్య పరిచేందుకు డీబీఆర్సీ కృషి చేస్తోందని మండల విద్యాశాఖాధికారి ఏ.శ్రీనివాసరావు అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74 వ గణతంత్ర దినోత్సవ సందర్భంగా భారత రాజ్యాంగం పట్ల పిల్లలకు అవగాహన కలిగించేందుకు రాజ్యాంగం పై క్విజ్ నిర్వహించారు. ఈ క్విజ్ పోటీలు నాలుగు గ్రూపులుగా గ్రూప్‌కి ఏడు మంది చొప్పున 28 మంది విద్యార్థులు పాల్గొ న్నారు. పోటీల్లో గెలుపొందిన, పార్టిసిపేట్ చేసిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు, పెన్నులు, పాఠశాలకు మెమొంటో అందించారు. కార్యక్రమానికి డీబీఆర్సీ కోఆర్డినేటర్ మేడే వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ డీబీఆర్సీ సంస్థ కృషి అభినందనీయమన్నారు. హెచ్‌ఎం నాగరాజు మాట్లాడుతూ విద్యార్థినీలలో 7, 8, 9, 10, చదువుతున్నటువంటి విద్యార్థులకు అవగాహన కల్పించాలని స్వచ్ఛంద సంస్థలుగా సహకరిస్తే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటనారాయణ, వి శ్రీనివాస్ నాయక్, షేక్ అబ్దుల్ రజాక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణంలో విజిలెన్స్ దాడులు



సత్తెనపల్లి : విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు గుంటూరు రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శుక్రవారం పట్టణంలోని నాలుగు ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో దాడులు నిర్వహించారు. ఒక దుకాణంలో యూరియా రూ.266.50 ఎమ్ఆర్‌పీ ధరకు విక్రయించాల్సి ఉండగా అధిక ధరకు విక్రయించడంతో కేసు నమోదు చేశారు. రూ. 20, 254 విలువ కలిగిన యూరియాను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టరు కోర్టుకి పంపనున్నారు. మూడు దుకాణాల్లో ఓ ఫారం లేని 49.6 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. వాటి విలువ రూ.11,57,274 గా ఉంది. స్టాప్ సేల్ రాసి వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్, వ్యవసాయ అధికారి జె.వాసంతి, ఎఫ్ఆర్ఓ షేక్.సైదులు, ఇన్‌చార్జి ఏడీఏ యస్ శ్రీధర్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.